


ఏప్రిల్ 5, 6 తేదీల్లో చలో ఢిల్లీ

కలిదిండి :కార్మిక చట్టాల అమలు కోసం వచ్చే 5, 6 తేదీల్లో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రామారావు పిలుపునిచ్చారు. స్థానిక మార్కెట్ యార్డులో భవన నిర్మాణ కార్మికుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చట్టాలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో కార్మిక చట్టాలను అమలు చేయకుండా, సంక్షేమ బోర్డులోని రూ.1250 కోట్లు చట్ట విరుద్ధంగా వాడుకుంటుందన్నారు. ఆ సొమ్ము సంక్షేమ బోర్డుకు జమ చేసి కార్మిక కుటుంబాలకు భరోసా కల్పించకుంటే రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సంక్షేమ బోర్డును రక్షించుకునేందుకు ఏప్రిల్ 5, 6 తేదీల్లో ఢిల్లీలో జరిగే ధర్నాలో భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పోతురాజు బాలాజీ, బత్తిన సూరిబాబు, పరసా రాజేష్ పాల్గొన్నారు.

'బండ' బాదుడు..!

వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంపు
జిల్లాలో వినియోగదారులపై రూ.మూడుకోట్ల భారం
వాణిజ్య సిలిండర్‌పైనా రూ.350.50 బాదుడు
రూ.2300కు చేరిన 19 కిలోల సిలిండర్ ధర
హోటళ్లలో పెరగనున్న టిఫిన్ ధరలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మోడీ సర్కార్ మరోసారి గ్యాస్ వినియోగదారులపై భారంమోపింది. వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ.350.50 పెంచుతున్నట్లు చమురు కంపెనీలు ప్రకటించాయి. దీంతో వంటగ్యాస్, కమర్షియల్ సిలిండర్ వినియోగదారులంతా లబోదిబోమంటున్నారు. గ్యాస్ ధర పెంపుతో వంటగ్యాస్ 14 కిలోల సిలిండర్ రూ.1150కు చేరుకోగా, 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.2,300కు చేరింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 8,14,847 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో రోజుకు 21 వేలు, నెలకు ఆరు లక్షల సిలిండర్లను వినియోగదారులు ఉపయోగిస్తున్నారు. అదుపూఅదుపు లేకుండా వంటగ్యాస్ సిలిండర్ పెరుగుతుండటంతో జనంపై పెనుభారం పడుతోంది. తాజాగా పెంచిన ధరతో జిల్లాలోని గ్యాస్ వినియోగదారులపై నెలకు అదనంగా రూ.మూడు కోట్ల భారం పడనుంది. వంటగ్యాస్‌కు నగదు బదిలీ తెచ్చిన కేంద్రం గత కొంతకాలంగా సబ్సిడీని నిలిపివేసింది. గ్యాస్ సిలిండర్ ధరను ఒకవైపు పెంచుకుంటూపోతున్న మోడీ సర్కార్ సబ్సిడీకి మాత్రం ఎగనామం పెట్టడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంటగ్యాస్ ధర నెల, రెండు నెలలకోసారి రూ.50 పెంచుకుంటూ పోతున్నారు. నలుగురు సభ్యులున్న కుటుంబానికి వంటగ్యాస్ సిలిండర్ నెలరోజులు వస్తుంది. నెలకు రూ.1150 వెచ్చించి సిలిండర్ కొనుగోలు చేయడం సామాన్య ప్రజానీకానికి పెనుభారంగా మారింది. కరోనా దెబ్బకు సామాన్య ప్రజల ఆదాయాలు గణనీయంగా పడిపోయాయి. ఎంతోమంది ఉపాధి కోల్పోయారు. అయినప్పటికీ ఏమాత్రమూ కనికరం లేకుండా మోడీ సర్కార్ ప్రజలపై భారాలు మోపుతోంది. ఇక భవిష్యత్‌లో వంటగ్యాస్ వదిలేసి కట్టెల పొయ్యి వినియోగిస్తే మంచిదనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది.

వాణిజ్య సిలిండర్ ధర భారీగా పెంపు

వ్యాపారులు వినియోగించే 19 కిలోల వాణిజ్య సిలిండర్‌పై ఒక్కసారిగా రూ.350.50 పెంచారు. దీంతో మొన్నటి వరకూ రూ.రెండు వేలలోపు ఉన్న సిలిండర్ ధర కాస్తా రూ.2300కు చేరింది. దీంతో హోటళ్లలో భోజనం, టిఫిన్ ధరలు విపరీతంగా పెరగనున్నాయి. ఇప్పటికే రెండు ఇడ్లీ రూ.35 పలుకుతోంది. ఇప్పుడు ఇది మరింత పెరగనుంది. ఇక దోసె, చపాతి, మినప అట్టు ధరలు ఇప్పటి వరకూ రూ.40 నుంచి రూ.50 ఉండగా వీటి ధరలు పెరిగే అవకాశం ఉంది. భోజనం ధర ప్రస్తుతం రూ.80 నుంచి రూ.వంద వరకూ ఉండగా ఇకనుంచి భారీగా పెరగనున్నాయి. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్య ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. వంటనూనె ధర లీటర్ రూ.180 వరకూ ఉంది. పప్పుల ధరలు కిలో రూ.వందకు పైనే ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో రవాణా ఛార్జీలు పెరగడంతో కూరగాయల ధరలు సైతం సామాన్యునికి అందనంత ఎత్తుకు ఎగబాకుతున్నాయి. వంటగ్యాస్ ధర సైతం సామాన్యులకు పెనుభారంగా మారింది. కార్పొరేట్లకు అడ్డంగా దోచిపెడుతూ సామాన్య ప్రజానీకంపై భారాలు మోపుతున్న మోడీసర్కార్‌పై జనాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇదేవిధంగా గ్యాస్ ధర పెరిగితే భవిష్యత్‌లో ప్రజలు ఏ విధంగా వంట చేసుకోవాలోనని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

గ్యాస్ ధర తగ్గించాలి : సిపిఎం

ఏలూరు : గ్యాస్ ధర పెంపును సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఖండించారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధరల భారం స్వయం ఉపాధి పొందుతున్నవారు, చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఇప్పటికే కరోనా, ఆర్థిక మాంద్యంతో చితికిపోతున్న ప్రజలు, స్వయం ఉపాధిదారులు ఈ పెరిగిన గ్యాస్ ధరలతో మరింత దుర్భరస్థితికి చేరుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతూ దేశ సంపదను అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఒక మాట, ఎన్నికల తరువాత మరో మాట చెప్పడం మోడీకి, బిజెపికే చెల్లిందని విమర్శించారు. త్రిపుర, మేఘాలయ, నాగలాండ్ రాష్ట్రాల ఎన్నికలు పూర్తయిన తర్వాత ఈ విధంగా బిజెపి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపడం అన్యాయమన్నారు. వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని మాయమాటలతో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం గత ఎనిమిదేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచారని విమర్శించారు. వంట గ్యాస్ సబ్సిడీని పూర్తిగా ఎత్తివేశారన్నారు. గతంలో రూ.417 ఉన్న వంట గ్యాస్ ధర ఆ తర్వాత రూ.1105కు, ఇప్పుడు రూ.1155కు చేరుకుందన్నారు. ఎనిమిదేళ్లలో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌పై పన్నుల ద్వారా రూ.25 లక్షల కోట్ల పైబడి భారం దేశ ప్రజలపై మోదీ ప్రభుత్వం మోపిందన్నారు. అది చాలదన్నట్లు ఇప్పుడు మరింత భారం మోపుతుందన్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం మోపుతున్న భారాల పట్ల మౌనంగా ఉండటమే కాకుండా రాష్ట్రంలో విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీలు పెంచిందని విమర్శించారు. ఇంటి పన్నులు, తాగునీటి కుళాయి పన్నులు కూడా పెంచారన్నారు. ఎన్నడూ లేని విధంగా చెత్త పన్నులు వేయడం దారుణమన్నారు. ఈ భారాలు తగ్గించాలని లేని పక్షంలో రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని రవి హెచ్చరించారు. వంట గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించి, సబ్సిడీని పునరుద్ధరించాలని రవి డిమాండ్ చేశారు.

సుస్థిర అభివృద్ధి సాధనకు కృషి చేయాలి

సంక్షేమ అభివద్ధి ఫలాలు అందరికీ అందాలి - రాష్ట్ర ప్రణాళిక కార్యదర్శి విజయ్ కుమార్



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి జిఎఎస్ఆర్‌కెఆర్.విజయ్ కుమార్

ప్రజాశక్తి - ఏలూరు

'స్పందన'లో వచ్చిన ఫిర్యాదు మనదే అన్న దృక్పథం కలిగిన విధంగా అధికారులు పనిచేస్తే తప్పక సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి జిఎఎస్ఆర్‌కెఆర్.విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం ఏలూరు ఆశ్రం ఆస్పత్రి మినీ ఆడిటోరియంలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు, పోలీసు, క్షేత్రస్థాయి అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, స్పందన కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ మానవ అభివృద్ధికి సంబంధించిన సుస్థిర అభివృద్ధి సూచీల సాధన కోసం ప్రతి ఒక్కరూ మనసు పెట్టి పని చేయాలన్నారు. ఏ పని ఎవరి కోసం చేస్తున్నాం, ఎందుకోసం చేస్తున్నాం అని ఆత్మావలోకనం చేసుకోవాలని, నిజమైన అభివృద్ధికోసం పని చేస్తున్న అవకాశం వచ్చినందుకు అదృష్టంగా భావించి ఇష్టం తో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందరికీ అందజేసే క్రమంలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టొద్దనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయగలిగితే సుస్థిర అభివృద్ధి లక్ష్యాల 2016-2030 మిలీనియం అభివృద్ధి లక్ష్యాలను సాధించగలుగుతామని స్పష్టం చేశారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం 17 అంశాలను పలు సూచికలుగా నిర్దేశించిందన్నారు. సమీకృత అభివృద్ధికి లక్ష్యాల సాధనకు ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది అంశాలు, 18 లక్ష్యాలు, 56 సూచికలతో ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. ఇందులో ప్రధానంగా సామాజిక, ఆర్థిక, పర్యావరణ, పీస్ అండ్ పార్టనర్షిప్ అంశాలున్నాయని తెలిపారు. నీతిఆయోగ్ అమలు చేస్తున్న 115 ఎస్‌డిజి సుచీలలో జిల్లాస్థాయిలో 61, గ్రామ, వార్డ్‌స్థాయిలో 47 ప్రభుత్వ పథకాలను మ్యాపింగ్ చేశామన్నారు. నాణ్యమైన విద్యనందించడానికి అనేక సంస్కరణలు చేపట్టామని, విద్య కోసం అమలు చేస్తున్న పథకాలను ఎస్‌డిజి సుచీలకు మ్యాపింగ్ చేశామన్నారు.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అందిన స్పందన ఆర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించిన రెండు జిల్లాల కలెక్టర్లు ప్రసన్న వెంకటేష్, పి.ప్రశాంతిని విజయ్‌కుమార్ అభినందించారు. ప్రజల అవసరాలను గుర్తించడంలో, వాటిని సకాలంలో నెరవేర్చడంలో ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందన్నారు. అర్జీదారు సంతృప్తిచెందే వరకూ అర్జీని పర్యవేక్షించే విధానాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు.

ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే సమయంలో కోవిడ్ పరిస్థితుల్లో లాక్‌డౌన్, మరణాలు సంభవించడంతో అభివృద్ధి కొంత కుంటుపడిందన్నారు. అయితే మళ్లీ ఈ లక్ష్యాలను సాధించేందుకు రెట్టింపు స్థాయిలో గురి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఏ రంగంలో అయితే వెనక్కి తగ్గామో, అక్కడ పురోభివృద్ధి సాధించేందుకు గట్టి ప్రయత్నాలు చేయాలన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు జోడించామన్నారు. ఏలూరు జిల్లాకు సంబంధించి ఆయా ఇండికేటర్స్ లక్ష్యాలకు జిల్లాస్థాయి నోడల్ అధికారులను నియమించామని చెప్పారు. విద్య, వైద్యం, తదితర రంగాలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. వివక్షకు తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. అందిన దరఖాస్తులను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరిస్తున్నామన్నారు. 10 నెలల నుండి బియాండ్ ఎసెల్ ఎ గ్రీవెన్సెస్ పరిష్కార శాతాన్ని 2 శాతానికి తగ్గించామన్నారు. స్పందన దరఖాస్తులు రీఓపెన్‌ను 15.7 శాతం నుండి 3.6 శాతానికి తగ్గించామన్నారు.పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల ద్వారా లక్ష్యాలు సాధిస్తున్నప్పటికీ సంబంధిత వివరాలు డేటా ఎంట్రీ చేయకపోవడం వల్ల ఆన్‌లైన్‌లో ప్రగతి ప్రతిబింబించడం లేదన్నారు. ఈ దృష్ట్యా ప్రతీశాఖ అధికారులు ఆయా వెబ్‌సైట్‌లను పరిశీలించి, వాటిలో డేటా ఎంట్రీ ఎలా చేయాలో అవగాహన పొందాలన్నారు. పరిష్కార మార్గం చూపడం ఒక ఆబ్జెక్ట్‌గా ఉండాలన్నారు. ఆయా సమస్యలను మానవీయ కోణంలో చూస్తే సమస్య పరిష్కరించడం కష్టమేమీ కాదని స్పష్టం చేశారు.

రాష్ట్ర పట్టణ పరిపాలనా శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ పురపాలనలో స్పందన, కాలుష్య నియంత్రణ తదితర అంశాలకు సంబంధించి ఎస్‌డిజి లక్ష్యాలను వివరించారు. స్పందన వినతులపై జె.జీవన్, గ్రామ, వార్డ్ వాలంటీర్ ఎస్‌డిజిలపై అనూషా, క్వాలిటీ ఎడ్యుకేషన్‌పై డాక్టర్ విజయదుర్గ, హెల్త్ ఇండికేటర్స్‌పై శివశంకర్‌బాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై గీతా రాణి, మహిళా అభివృద్ధిపై రోజా రాణి, స్థానిక సంస్థల ఎస్‌డిజిలకు సంబంధించి ప్రసాద్, పట్టణాభివృద్ధి, పారిశుధ్యంపై రావీంద్రబాబు పవర్‌పాయింట్ ద్వారా అవగాహన కల్పించారు.

ఏలూరుజిల్లా జెసి పి.అరుణ్ బాబు మాట్లాడుతూ ఎస్‌డిజిలపై ప్రణాళిక అంశాలు అత్యంత విలువైనవని, వాటిని గుర్తించి ఎస్‌డిజి సూచీల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ జిల్లా ఇన్‌ఛార్జి జెసి ఎం.సూర్యతేజ, సబ్ కలెక్టర్లు ఆదర్స్ రాజేంద్రన్, డిఆర్‌ఒలు ఎవిఎన్ఎస్.మూర్తి, కె.కృష్ణకుమారి, రెండు జిల్లాల ఆర్‌డిఒలు, జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంలో చేర్చాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంలో చేర్చాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం టి.నరసాపురంలోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద గిరిజన సంఘం మండల మహాసభ మండల కార్యదర్శి పూసం చిన్న సూర్యారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈనెల 27, 28 తేదీల్లో జీలుగుమిల్లిలో జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గోడపత్రాలు విడుదల చేశారు. అనంతరం గిరిజన సంఘం మండల కమిటీ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షులుగా గురుగుంట్ల సావిత్రి, మండల కార్యదర్శిగా పి.చిన్నసూర్యారావుతో పాటు ఎనిమిది మందితో మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా గిరిజన హక్కులను కాపాడాలని తాతల కాలం నుంచి గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని, గిరిజనుల సాగులో ఉన్న భూములకు సాగుపత్రాలలివ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు వేయ్యాలన్నారు. శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని మహాసభలో తీర్మానించారు. రామమ్మగూడెం, బచ్చులేటిగూడెం, మల్లప్పగూడెం, సాలెగూడెం, అబ్దుల్లాపురం మొత్తం21 గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంలో కలపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ, రైతు సంఘం మండల కార్యదర్శి ఎ.మురళీ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మడకం సుధారాణి, జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ పాల్గొన్నారు.

చేనేత రంగానికి బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

చేనేత రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.20 వేలు కోట్లు కేటాయించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శనివారపుపేటలో ఉన్న వీవర్స్ కాలనీలో చేనేత కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం వార్డు సచివాలయం అడ్మిన్‌కు సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు నాయకత్వన ప్రతినిధి బృందం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం తరువాత అత్యధిక మంది చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సుమారు రెండు లక్షల మంది చేనేతపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఉప వృత్తులపై మరో రెండు లక్షల మంది జీవిస్తున్నారని వారు తెలిపారు. ఇంత చరిత్ర కలిగిన చేనేతకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని, ఆ నగదు నేతన్న నేస్తం పథకం లబ్ధిదారులకే సరిపోతుందని, ఒక్క రూపాయి కూడా అదనంగా కేటాయింపులు లేవని ఆదిశేషు తెలిపారు. సహకార బ్యాంకుల్లో తీసుకున్న అప్పులకు వడ్డీలు చెల్లించలేక సహకార సంఘాలు దివాలా తీస్తున్నాయన్నారు. 2023-24 సంవత్సరాలకు బడ్జెట్‌లో చేనేతకు రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని కోరారు. ప్రతి చేనేత కార్మికునికి నేతల నేస్తం పథకాన్ని వర్తింపజేయాలని, షెడ్డుతో కూడిన ఇల్లు ప్రభుత్వమే నిర్మించి ఉచితంగా ఇవ్వాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలని, ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి చేనేత కార్మికునికి 200 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం సీనియర్ నాయకులు మాడా వెంకటేశ్వరరావు, గుత్తి పోతురాజు, పిచ్చుక నాగేశ్వరరావు, నార్ని నాగరత్నం పాల్గొన్నారు.

గిరిజనసంఘం జిల్లా మహాసభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఈనెల 27, 28 తేదీల్లో జీలుగుమిల్లిలో జరిగే గిరిజన సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద బుధవారం గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ మహాసభకు మండలంలోని ప్రతిఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూసం చిన్నసూర్యారావు పిల్లి రామకృష్ణ, తుమ్మల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎంఎల్‌సి అభ్యర్థి చంద్రశేఖర్‌కు పంచాయతీ రాజ్ ఛాంబర్ మద్దతు



మద్దతు తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వీరవాసరం మాజీ ఎంపిపి వీరవల్లి చంద్రశేఖర్‌కు జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ తరపున మద్దతు ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ సలహాదారులు పిల్లి సత్తిరాజు, జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు కడలి గోపాలరావు తెలిపారు. బుధవారం టిడిపి సానుభూతిపరులు ఎమ్మెల్సీ అభ్యర్థులకు పంచాయతీరాజ్ ఛాంబర్ తరపున హోటల్ అతిథి కాన్ఫరెన్స్ హాల్లో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్తిరాజు మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఛాంబర్ తరపున పోటీ చేసిన నలుగురిలో ఒకరిని మద్దతుగా ఎన్నుకున్నామని, కేవలం ప్రభుత్వం విధి విధానాలకు వ్యతిరేకంగా పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి పోటీల్లో పాల్గొంటున్నామని తెలిపారు. కడలి గోపాలరావు మాట్లాడుతూ ఎంపిటిసిలకు, జెడ్‌పిటిసిలకు, ఎంపిపిలకు, జెడ్‌పి ఛైర్మన్‌కు గౌరవవేతనాలు పెంచే వీలుగా తాము ఎన్నికల్లో బలమైన అభ్యర్థిని నిలబెడుతున్నామని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న సభ్యులంతా వీరవల్లి చంద్రశేఖర్‌ను బలపరచాలని, అదేవిధంగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. మిగిలిన సభ్యులంతా చంద్రశేఖర్‌ను బలపరిచేందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పర్యటించి ప్రచారం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, ఈ వ్యవస్థను బలోపేతం చేసేందుకు తాను పోటీ చేస్తున్నానని తెలిపారు. పంచాయతీరాజ్ ఛాంబర్‌లో అన్ని పార్టీలకు సంబంధించిన సభ్యులున్నారని తెలిపారు. ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, కౌన్సిలర్లు తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థులు గుంటుపల్లి సర్పంచి గోరింక దాసు, దేవరపల్లి ఆదాం, పసల వెంకటాచలం చంద్రశేఖర్‌కు పూర్తిమద్దతు తెలియజేస్తున్నామని ప్రకటించారు.

బకాయి వేతనాలు చెల్లించాలని స్కూల్ స్వీపర్ల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగరపాలక సంస్థ స్కూల్ స్వీపర్ల నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ మున్సిపల్ స్కూల్ స్వీపర్ల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం స్వీపర్లు డిఇఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, యూనియన్ గౌరవఅధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ స్కూల్ స్వీపర్లు నాలుగు నెలలుగా జీతాల్లేక అవస్థలు పడుతున్నారన్నారు. మున్సిపల్ పాఠశాలలను జిఒ 84 ద్వారా విద్యా శాఖలో విలీనం చేశారని, అప్పటి నుంచి విద్యాశాఖ అధికారులు స్కూల్ స్వీపర్ల జీతాలు ఇవ్వాల్సి ఉందన్నారు. జిఒ విడుదల చేసి ఐదు నెలలు అవుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు స్కూల్ స్వీపర్ల జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈ నెల ఆరో తేదీ నుంచి పనులు నిలుపుదల చేసి నిరవధిక ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ డిఇఒ షరీఫ్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం యూనియన్ నాయకులు జె.స్వాతి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఎస్.భాస్కర్‌రావు, చలమల విజయలక్ష్మి, రత్నమణి, జగ్గలక్ష్మి, రమణమ్మ, రామలక్ష్మి, కృష్ణవేణి, లక్ష్మీరాజ్యం, రాంబాబు, నస్రీన్ నాయకత్వం వహించారు.

గంజాయి రవాణాపై నిఘా

చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - చాట్రాయి

గంజాయి అమ్మకాలు, రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ సూచించారు. చాట్రాయి పోలీస్‌స్టేషన్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. దర్యాప్తులో ఉన్న కేసుల వివరాల గురించి ఎస్ఐ కె.ప్రతాపరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సదరు కేసుల దర్యాప్తులను త్వరితగతిన పూర్తిచేసి ఛార్జ్‌షీట్‌లను సంబంధిత కోర్టులో ఫైల్ చేయాలని చెప్పారు. చాట్రాయి పోలీస్ స్టేషన్ పరిధిలో నాటు సారా తయారీని నివారించాలని, గంజాయి అమ్మకాలపై ముందస్తు సమాచారాన్ని సేకరించి గంజాయి అమ్మకాలు, రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి సచివాలయ పరిధిలో ఉన్న బ్యాడ్ క్యారెక్టర్లను గురించి అసాంఘిక కార్యకలాపాల నిర్వహించే వారి సమాచారాన్ని సేకరించి ముందస్తు చర్యలను తీసుకోవాల సూచించారు. దొంగతనాల నివారణ కోసం రాత్రి సమయంలో బీట్ సిస్టమ్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. నేర చరిత్ర కలిగినవారిపై, రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని చెప్పారు. మారుతున్న చట్టాలకు అనుగుణంగా సిబ్బంది ఉద్యోగ నిర్వహణ చేయాలన్నారు. ఉద్యోగ నిర్వహణలో చేయాల్సిన పనుల గురించి తగిన సూచనలు, సలహాలు అందించారు. ఎస్‌పితో పాటు నూజివీడు సిఐ అంకబాబు ఉన్నారు.

ఉమ్మడి జిల్లా ప్రజా ప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠం ప్రారంభం

చైర్‌పర్సన్‌గా మేరీ గ్రేస్‌కుమారి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజాప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఉమ్మడి ఉమ్మడి జిల్లా ప్రజా ప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠం చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్‌కుమారి బుధవారం బాధ్యతలు చేపట్టి, అనంతరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మేరీగ్రేస్‌కుమారి మాట్లాడుతూ 2002లో న్యాయ సేవాధికార సంస్థ చట్టం 1987 సవరణ ద్వారా ప్రజాప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠం చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. దీని ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రజలు ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వారి సమస్యలు కోర్టులో వేయకుండా ఉన్నవారికి నేరుగా ఈ న్యాయ పీఠాన్ని ఆశ్రయించవచ్చని తెలిపారు. వీరికి న్యాయపరంగా ఉచితంగా సమస్యను పరిష్కరించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. ఇరుపార్టీల మధ్య రాజీ కుదరని పక్షంలో వారి వ్యాజ్యం, సమర్పించిన పత్రాలు పరిశీలనకు తీసుకుని అవార్డు ఇస్తామని చెప్పారు. శాశ్వత అవార్డు పొందిన తర్వాత ఈ అవార్డును వేరే కోర్టులో అప్పీలు, ఛాలెంజ్ చేసుకునే అవకాశం లేదన్నారు. ఈ ప్రజాప్రయోజనాలు శాశ్వత న్యాయ పీఠం కేసులు మార్చి ఒకటి నుంచి పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు.

ఈ న్యాయపీఠంలో10 సమస్యలకు సంబంధించిన కేసులను స్వీకరిస్తామని చెప్పారు. వీటిలో రవాణాకు చెందిన గాలి, రోడ్డు, నీటి సమస్యలు, తపాలా, టెలిఫోన్, టెలిగ్రాఫ్, సర్వీసెస్ సేవలు, తాగునీరు, విద్యుత్, సంబంధించిన సేవలు, పారిశుధ్యం, ఆసుపత్రి సర్వీస్, బీమా సేవలు, విద్య, విద్యాసంస్థల సమస్యలు, గృహాలు, రియల్ ఎస్టేట్ సేవలు, బ్యాంకు, ప్రయివేటు ఫైనాన్స్ సమస్యలు, ఉపాధి హామీకి సంబంధించిన సేవల్లో సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ ప్రజాప్రయోజనాలు శాశ్వత న్యాయ పీఠాన్ని ప్రజలందరూ సద్వినియం చేసుకొని సుఖంతమైన జీవితాన్ని గడపాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమానికి ముందు ప్రజాప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠం ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మేరీ గ్రేస్‌కుమారికి ప్రముఖన్యాయవాదులు, కోర్టు సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఎంఎల్‌సి ఎన్నికల ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, బందోబస్త్ ఏర్పాట్లపై బుధవారం జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, పోలీసు అధికారులతో రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంకె.మీనా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్నికల నియమావళి ఉల్లంఘన లేకుండా ర్యలు తీసుకోవాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దష్టి కేంద్రీకరించాలన్నారు.

ఏలూరు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి వె. ప్రసన్న వెంకటేష్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలోని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటుహక్కు వినియోగించుకునే ప్రజాప్రతినిధులకు గుర్తింపు కార్డులు, ఓటర్ స్లిప్ లు అందిస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఎనిమిది మంది డిఎస్‌పిలు, పది మంది సిఐలు, 230 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్త్ ప్రణాళిక రూపొందించామన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్నికల నిర్వహణపై అధికార్లతో సమీక్షించారన్నారు. పోలింగ్ నిర్వహణకు ప్రిసైడింగ్, అసిస్టెంట్ అధికారులుగా తాసిల్దార్, డిప్యూటీ తహశీల్దార్లను నియమించామన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. పోలింగ్ సిబ్బందికి ఈనెల రెండో తేదీన, మైక్రో అబ్జర్వర్లకు నాలుగో తేదీన శిక్షణ అందిస్తున్నామన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు కూడా ఏర్పాట్లు పూర్తి చేశామని, కౌంటింగ్‌కు ఐదు టేబుల్స్ ఏర్పాటు చేశామని, ఐదు టేబుల్స్‌కు ఐదుగురు జిల్లా అధికారులను పర్యవేక్షకులుగా నియమించామని తెలిపారు. జిల్లాలో ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను 89.51 శాతం పూర్తి చేశామని, దీనిని 93 శాతానికి తీసుకువెళ్తా మన్నారు. ఎన్నికల సామగ్రి స్థానికంగా కొనుగోలు చేసేందుకు ఏలూరు ఆర్‌డిఒను నోడల్ అధికారిగా నియమించామన్నారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను వెబ్‌క్యాస్టింగ్‌కు చర్యలు తీసుకుంటు న్నామన్నారు. జిల్లాలో ఎక్కడా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు లేవని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసి పి.అరుణ్ బాబు, డిఆర్‌ఒ మూర్తి, సెబ్ అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, ఆర్‌డిఒలు పెంచల్ కిషోర్, ఝాన్సీరాణి, జెడ్‌పి సిఇ కె.రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు అధికారులు పాల్గొన్నారు.

పొగమంచుతో ఇక్కట్లు



కమ్ముకున్న పొగమంచు

ముదినేపల్లి :గత వారం రోజులుగా ముదినేపల్లిని పొగమంచు కమ్మేస్తుంది. తెల్లవారుజామున మొదలవుతున్న ఈ పొగమంచు ఉదయం తొమ్మిది గంటల వరకు వీడడం లేదు. దీంతో పాదచారులు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మంచు దట్టంగా రోడ్లపై అలుముకుపోవడంతో వాహనాలకు దారి కనబడక వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు రోడ్లు అధ్వానంగా ఉండడంతో పలుమార్లు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముదినేపల్లి వైకూడలి నుంచి గుడివాడ, కైకలూరు, గుడ్లవల్లేరు, బంటుమిల్లి రోడ్లల్లో పొగమంచు దట్టంగా ఆలుముకుపోవడంతో ప్రజలు, ప్రయాణికులు, పాదచారులు, ఉదయన్నే కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ,వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.

18న ప్రత్యేక లోక్ అదాలత్

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 18వ తేదీన చింతలపూడి కోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చింతలపూడి ఫుల్ అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి పి.పరేష్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలిపారు. కుటుంబ తగాదా కేసులు, గృహ హింస కేసులు రాజీ చేసుకోవచ్చని చెప్పారు. ప్రతి శుక్రవారం చింతలపూడి కోర్టులో ప్రి లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎస్ఇబి సిఐ, ఎస్ఐ బదిలీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న ఎస్ఇబి సిఐ ఎస్.మణికంఠరెడ్డి, ఎస్ఐ ఎల్.రమాదేవిలను బదిలీ చేసినట్లు సిఐ మణికంఠ రెడ్డి తెలిపారు. నూతన జిల్లాల ప్రాతిపాదికన ఈ చెక్ పోస్టులో సిఐ స్థాయి అధికారి పోస్టును తొలగించడంతో ఆయనను మచిలీపట్నం ఎస్ఇబి స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎస్ఐ ఎల్.రమాదేవిని ఏలూరు ఇంటెలిజెన్స్ వింగ్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు. ఈ స్టేషన్‌కు వై.ఫణిభాస్కర్‌ను ఇన్‌ఛార్జిగా నియమించనున్నట్లు తెలిపారు.

3న సీజ్డ్ వాహనాల వేలం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ యాక్ట్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన ఆరు మోటార్‌సైకిళ్లకు, ఒక ఆటోకు ఈ నెల మూడో తేదీన జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ వి.చంద్ర తెలిపారు. ఆసక్తి ఉన్నవారు తగిన డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

ఉద్యోగ మేళాలో ఆరుగురు ఎంపిక

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో బుధవారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఆరుగురు అభ్యర్థులు ఎంపికైనట్లు కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి తెలిపారు. ఫార్మాసిస్టు రిటైల్ ట్రయినింగ్ అసోసియేట్‌కి ఎంపికైనట్లు చెప్పారు. వీరికి రూ.11 వేల వేతనం ఇస్తారని తెలిపారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ సూచించారు. మండలంలోని దేవరకుంట బస్టాప్ వద్ద హెల్మెట్లు ధరించడంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే నేరమన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల వాహన చోదకులు సురక్షితంగా గమ్య స్థానానికి చేరుకో వచ్చన్నారు.

4 నుంచి అమృతేశ్వర స్వామి ఉత్సవాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెంలో ఉన్న శ్రీఅమృతేశ్వర స్వామివారి దేవస్థానంలో ఈ నెల నాలుగో తేదీ నుంచి ఏడో తేదీ వరకు స్వామివారి కళ్యాణ ఉత్సవాలు జరుగుతున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఇదే ప్రాంగణంలో ఉన్న మరో దేవస్థానం శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కూడా ఈ నెల 3వ తేదీ నుంచి తొమ్మిదో వరకు స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలను ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభిస్తారని, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివార్ల తీర్థప్రసాదాలు స్వీకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చక్కపల్లి గ్రామంలో ఉన్న శ్రీహనుమంత్ లక్ష్మణసమేత శ్రీ కోదండ రామాలయంలో బుధవారం ఉదయం అభినవ ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం గ్రామస్తులు సమక్షంలో చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టుకు భీమవరం (గునుపూడి) వాస్తవ్యులు వంగల వెంకట్రావు డిడి ద్వారా రూ.1,01,116 విరాళాన్ని దేవాలయ ఏఇఒ మెట్టపల్లి దుర్గారావుకు అందించారు. ఆలయ అధికారులు దాతకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, బాండ్ పేపర్ అందించారు.

నారాయణపురంలో మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఎస్ఎస్ మోటార్స్ కశలవ ఎలక్ట్రికల్ బైక్ షోరూం అధినేతలు గుణ్ణం సురేష్‌బాబు, వెజ్జు సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం నారాయణపురంలో ఏలూరు బస్టాప్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. నేటి నుంచి వేసవి వెళ్లేంతవరకూ ప్రతిరోజూ చలివేంద్రాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దిడ్ల అలకనంద శ్రీను, ఉప సర్పంచి అడపా శ్రీను, బళ్ల త్రిమూర్తులు, పాతూరి సత్యనారాయణ, సప్పా వీరబాబు, పంచాయతీ వార్డు సభ్యులు, యువత పాల్గొన్నారు.

శ్మశానవాటికలో శివుని విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

స్థానిక హిందూ శ్మశాన వాటికలో శివుని భారీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. శ్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో భాగంగా బుట్టాయగూడెం గ్రామానికి చెందిన నాతి సూర్యనారాయణ, సుబ్బలక్ష్మి దంపతుల పేరు మీదుగా వారి కుమారుడు శివుని విగ్రహాన్ని వేద పండితులు పెద్ది రామకృష్ణశర్మ వేద మంత్రోచ్ఛారణల మధ్య బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ పురోహితుడు, హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సభ్యులు అనిపెద్ది రామకృష్ణ శర్మ మాట్లాడారు. సుమారు రూ.లక్ష విలువైన శివుని విగ్రహాన్ని అందించిన నాతి సూర్యనారాయణ కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సభ్యులు అనంతాత్మకులు రవిబాబు, ఇందుకూరి రాజబాబు, వేగిరాజు బంగార్రాజు, ఇందుకూరి సురేష్, నల్లూరి కృష్ణమోహన్, సీతారామరాజు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

శ్రీగంధం చెట్లు చోరీ

ప్రజాశక్తి - ముసునూరు

గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం లింగయ్యపాలెం గ్రామానికి చెందిన కొండెపాటి వెంకట సుబ్బారావు మండలంలోని కాట్రేనిపాడు రెవెన్యూ పరిధిలో ఆర్ఎస్ నెంబరు 267-1లో 27 సంవత్సరాల గల 177 శ్రీ గంధం చెట్లు ఉన్నాయి. ఆయన రెండు, మూడు రోజులకొకసారి వచ్చి వెళ్తూ ఉంటాడు. ఈ క్రమంలో గత నెల 28వ తేదీన ఆయన వచ్చే సరికి 40 చెట్లు సరికి గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారని గుర్తించాడు. 27 చెట్లు నరికి నరికి ఉన్నాయని తెలిపాడు. దీంతో సుబ్బారావు ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

జీలుగుమిల్లి :రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మండలంలోని రమణక్కపేట సమీపంలో జాతీయ రహదారిపై ఫిబ్రవరి 15న ద్విచక్రవాహనం, ఐసర్ వాహనం ఢీ కొని పి.అంకంపాలెం గ్రామానికి చెందిన ఎస్.శేషయ్య (42) తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని స్థానికులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పందుల పోటీలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పాలచర్ల రాజవరం గ్రామ శివారులో బుధవారం ఉదయం భారీ ఎత్తున తెలంగాణ రాష్ట్రం నుంచి పలువురు, చింతలపూడి ఏరియా నుంచి కొంతమంది వచ్చి పందేల పోటీలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో బరిలో ఉన్న నాలుగు పందులను, ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. వారి వద్ద నుంచి 1670 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దేవులపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

ఒకరు మృతి మరొకరికి తీవ్ర గాయాలు

రోడ్డుపై మృతదేహంతో బంధువుల బైఠాయింపు



రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు



క్షతగాత్రులకు సపర్యాలు చేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని దేవుల పల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం మధ్యాహ్న సమయంలో ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అవుల వెంకన్న (20) మృతి చెందగా మరో వ్యక్తి చింతల ఏడుకొండలు తీవ్ర గాయాల పాలయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... చింతలపూడికి చెందిన ఆవుల వెంకన్న డిగ్రీ చదువుతున్నాడు. బుధవారం కామవరపుకోటకు చెందిన తన స్నేహితుడు చింతల ఏడుకొండలుతో కలిసి ద్విచక్రవాహనంపై జంగారెడ్డిగూడెం వెళ్లారు. తిరిగి కామవరపుకోటకు వెళ్తున్న క్రమంలో మార్గం మధ్యలో ఆర్‌టిసి బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆవుల వెంకన్న తలకు తీవ్ర గాయమైంది. చింతల ఏడు కొండలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఆవుల వెంకన్నను ఏలూరుకు తరలించారు. మార్గమధ్యలోనే వెంకన్న మృతి చెందాడు.


మృతదేహంతో రోడ్డుపై బైఠాయింపు

వెంకన్న మృతి వార్త తెలుసుకున్న బంధువులు అధిక సంఖ్యలో సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఆర్‌టిసి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడం వల్లే ఇంతటి ఘోర ప్రమాదం జరిగిందని బాధిత కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఆవుల వెంకన్న మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి ఆందోళనకు దిగారు. ఆర్‌టిసి డిపో మేనేజర్, ఉన్నతాధికారులు వచ్చి మృతుని కుటుంబానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని రోడ్డుపై బైఠాయించారు. దీంతో దేవులపల్లి నుంచి ఇరువైపులా వాహనాలు నిలిచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. లక్కవరం పోలీసులు ఆందోళనకారులకు నచ్చచెప్పేందుకు ప్రయత్నం చేసినప్పటికీ బాధిత కుటుంబీకులు ఆందోళన విరమించలేదు. ఈ నేపథ్యంలో జంగారెడ్డిగూడెం డిఎస్‌పి కెవి.సత్యనారయణ, సిఐ బాలసురేష్‌బాబు సంఘటనా ప్రాంతానికి పోలీస్ సిబ్బందితో చేరుకున్నారు. ఆందోళన కారులతో చర్చించారు. ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో మృతుని బంధువులు ఆందోళన విరమించారు.

ఉగాదికి జగనన్న ఇళ్ల గృహ ప్రవేశాలకు చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండల పరిధిలో ఉగాది నాటికి 329 గృహ ప్రవేశాలు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు గృహ నిర్మాణ సంస్థ భీమడోలు సహాయ ఇంజినీర్ సతీష్ తెలిపారు. మండలంలోని 28 జగనన్న లే అవుట్‌లో కొనసాగుతున్న గృహ నిర్మాణాల ప్రగతిని ఆయన వివరిస్తూ గృహ నిర్మాణాల కోసం ప్రత్యేకించిన 28 లే అవుట్‌లలో నిర్మాణాలకు అవసరమైన రోడ్డు సౌకర్యం, నీటి లభ్యత, విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉంచామన్నారు. ఈ క్రమంలో భీమడోలు మండలంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గోదాముల వద్ద సిమెంటు, ఇనుము నిల్వలు సిద్ధం చేశామన్నారు. లబ్ధిదారులు తమకు అవసరమైన ఇసుకను చేబ్రోలు ర్యాంపు నుంచి, కంకరను పంగిడి నుంచి తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. గృహ నిర్మాణాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక, రాయితీపై సిమెంటు, కంకర, ఇనుము అందుబాటులో ఉంచిందన్నారు. తాజాగా ప్రభుత్వం అందించే ప్రోత్సాహకంలో భాగంగా ఐకెపి ద్వారా గ్రూపులోని డ్వాక్రా సభ్యులు చేసుకున్న పొదుపు ఆధారంగా రెండు నుంచి మూడు విడతలుగా గృహ నిర్మాణాల కోసం అదనపు రుణాలు అందిస్తున్నామన్నారు. ఈ తరహాలో ఇప్పటివరకు 34 మంది ఐకెపి అదనపు రుణాలను తీసుకున్నారని వివరించారు. గృహ నిర్మాణాలు చేపట్టలేని లబ్ధిదారుల విజ్ఞప్తి మేరకు గృహ నిర్మాణ సంస్థ మధ్యవర్తిత్వం వహించి గృహ నిర్మాణాలకు అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. మండలంలో కొనసాగుతున్న గృహ నిర్మాణాల ప్రగతిని ఆయన వివరిస్తూ మండలంలో కేటాయించిన లక్ష్యం మేరకు 2086 గృహాల నిర్మాణం చేపట్టాల్సిందన్నారు. ఈ క్రమంలో 413 ఇల్లు బేస్‌మెంట్ స్థాయిలోనూ, 96 రూఫ్ స్థాయిలోనూ, 84 ఇళ్లు స్లాబ్‌ల దశను దాటాయన్నారు. 907 ఇళ్ల నిర్మాణాలు పూర్తయి బిల్లులు చెల్లింపు జరిగిందన్నారు. 586 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. తాజాగా ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యం మేరకు ఉగాది నాటికి ప్రస్తుతం రూఫ్ స్థాయి, స్లాబ్ స్థాయి, బేస్‌మెంట్ స్థాయిలో గల కొన్ని ఇళ్లతో కలిపి 329 ఇళ్లు పూర్తి చేయటం లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. ఇదే క్రమంలో వంద రోజుల్లో నూరు శాతం నిర్మాణాల పథకంలో భాగంగా 499 ఇళ్లను రూఫ్ స్థాయి, స్లాబ్ స్థాయి వరకు నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామని గృహ నిర్మాణ సంస్థ భీమడోలు సహాయ ఇంజినీర్ తెలిపారు.




గృహ నిర్మాణాల ప్రగతి పరిశీలిస్తున్న సతీష్

పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - కుక్కునూరు

ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్రం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు ఆటో డ్రైవర్ల యూనియన్ (సిఐటియు) సమావేశం వెంకటేశ్వర్లు అధ్యక్షతన సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఒ పెంటరావుకు అందించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ ప్రజలను సురక్షితంగా వారి గమ్యానికి చేరవేర్చేందుకు అహర్నిశలు కృషి చేస్తూ వారి కుటుంబాలను పస్తులు ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రోజు రోజుకు ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుకుంటూ పోతుంటే జీవనం ఇబ్బంది కరంగా మారుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణ రంగంపై అనేక రూపాల్లో పన్నులు విధిస్తూ తమ ఆదాయాన్ని పెంచుకుంటున్నాయన్నారు. పన్నులు కడుతున్న ఆటో కార్మికులను చలనాలు పేరుతో ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కుక్కునూరు మండల కేంద్రంలో వందకు పైగా ఆటోలు ఉన్నాయని, అవి పార్కింగ్ చేసుకోవడానికి సరైన స్థలం లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలు సరిగా ఎక్కడం లేదని, ఎక్కడైన రోడ్డు పాయింట్‌లో ఆపితే మర్యాద లేకుండా డ్రైవర్లను మాట్లాడుతున్నారన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో ఆటోలు పార్కింగ్ చేసుకోవడానికి పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు మడవి దుర్గారావు, ఆటో యూనియన్ కార్యదర్శి సంపత్తి సత్యనారాయణ, కోశాధికారి శివ, ఆటో డ్రైవర్లు వై.రాజు, శనగ రాము, వీరబాబు, రాయి మహేష్ పాల్గొన్నారు.



విఆర్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

జంగారెడ్డిగూడెంలో ఎంపీ కోటగిరి పర్యటన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్‌బాబు పట్టణంలో పర్యటించారు. బుధవారం నూతనంగా నిర్మించిన విజయదుర్గ అమ్మవారి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామమోహనరావు, ఆలయ నిర్మాణ కమిటీ ఎంపి కోటగిరి శ్రీధర్ బాబును స్వాగతించారు. శశికుమార్ ఆధ్వర్యంలో ప్రతిష్టిస్తున్న విజయదుర్గ అమ్మవారి విశిష్టతను ఆయనకు వివరించారు. ఎంపీతో పాటు స్థానిక వైసిపి నాయకులు, కౌన్సిలర్లు ఉన్నారు.

నూజివీడులో అన్నదానం

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణంలోని కుందనపువారి వీధిలో మత్ కామాక్షి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఈ ఆలయంలో అన్నదానం చేయడం అనేది కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా కొనసాగుతుంది. ఈ అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు హాజరై స్వామి వారి అన్న ప్రసాదాలు స్వీకరించారని విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు యర్రోజు శ్రీనివాసాచార్యులు తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మందిరం నిర్మాణానికి, ప్రతినెల ఒకటో తేదీన నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు యర్రోజు శ్రీనివాసాచార్యులు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా విచ్చేసిన ప్రముఖులు, భక్తులు కొనియాడారు.

ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ద్రావణం

ప్రజాశక్తి - గణపవరం

వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ప్రతిఒక్కరూ ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని సిహెచ్.అగ్రహారం గ్రామ సర్పంచి చుక్కా అప్పారావు అన్నారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సహాయకులు నామాల రాజు మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రతిఒక్కరూ ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలన్నారు. ఉదయం 11 గంటల తరువాత బయటకు వెళ్లవద్దని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే ఎండ తగలకుండా గొడుగు వేసుకుని వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శేషవేణి, ఎం.ఏసుమ్మ, పి.దుర్గాభవాని పాల్గొన్నారు.



ఉపాధి కూలీలకు ఒఆర్ఎస్ ద్రావణం అందిస్తున్న సర్పంచి

అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి - ముదినేపల్లి

అవయవ దానంలో భాగంగా తన రెండు కళ్లు దానం చేస్తున్నట్లు ముదినేపల్లికి చెందిన ప్రముఖ వైద్యులు అంబుల మనోజ్ తెలిపారు. వైష్ణవి మనోజ్ హాస్పటల్ ప్రాంగణంలో అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్ వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవి మాట్లాడుతూ ఒక చనిపోయిన వ్యక్తి నుంచి 500 మందికి చర్మం మినహా అవయవ దానం చేయవచ్చన్నారు. అన్ని దానాల కంటే అవయవ దానం చాల విశిష్టమైందన్నారు. తను వైద్య విద్య చదువుతూ అవయవ దానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు వక్తలు వైష్ణవిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లికి చెందిన ఐటిఐ ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ, లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపల్ రఘురామయ్య, కె.అర్జునరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైష్ణవి

21 వరకు జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా అదనపు వైద్యాధికారిణి (ఎయిడ్స్ లెప్రసీ, టిబి) డాక్టర్ జి.రత్నకుమారి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏలూరు గజ్జెలవారిచెరువు యుపిఆర్‌సి నుంచి బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ప్రజలకు స్పర్శలేని మచ్చలు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు ఉండటం, కనురెప్పలు మూతపడక పోవడం, చెవుల వాపు, బుడిపెలు, కాళ్లు, చేతులు పట్టు ఇవ్వక పోవడం వంటి లక్షణాలు ఉంటే దగ్గరలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. ప్రభుత్వ ఆసు పత్రులలో ఉచితంగా చికిత్స ఇస్తున్నట్లు తెలిపారు. సర్వే నిమిత్తం ఇంటికి వచ్చే ఆరోగ్య కార్యకర్తలకు సహకరించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్జెలవారిచెరువు యుపిహెచ్‌సి వైద్యాధికారి, సిబ్బంది, హెచ్ఇఒ కె.సత్యానందం, డిపిఎంఒ కె.సత్యనారాయణ, బాలకృష్ణ, ఎంపిహెచ్ఎస్ సాగర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఉరుకూరులో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తుంటే ప్రతిపక్షం దుష్ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, పార్టీ మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, పార్టీ నేతలు శీలం రామకృష్ణ, బొర్రా శేషుబాబు, బేతపూడి వెంకటరమణ, లేళ్ల ఆంజనేయులు, కె.ప్రవీణ్, జాస్తి చంటి, ఈడే వెంకటేశ్వరరావు, తాడంకి రాజేష్, పేరే రామకృష్ణ, గంటా కోటేశ్వరరావు, ఇఒపిఆర్‌డి టివి.సారధి పాల్గొన్నారు.

In the Court of the VIIth Addl. District Judge, Eluru, W.G.Dist.,

I.A. 4/2023, A.S. 75/2016

Between:

Mir Ishaq Ali and 2 others

...Petitioners/Appliants

Vs

Kandula Lakshmana Rao (died) and others

...Respondents/Respondents

R-41: Smt. Kandula Govardhanamma, W/o. late Kandula Lakshmana Rao, R/D.No. 6-B2-56, Eluru, West Godavari District, Eluru JCJC.

పై నెంబరు గ్రంథములో I.A. 4/2023 ను Respondents R1, R4, R5, R16, R17 and R20 చనిపోయినందున వారి వారసులుగా R41 to R51 లను LR's గా చేర్పించమని కోరుచూ దాఖలు చేసిన పై నెంబరు I.A. లో R41 ప్రతివాదికి ఏమైన అభ్యంతరములు ఉన్న యెడల **ది. 07-3-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి లేదా వకీలు (అడ్వకేట్) ద్వారా హాజరు అయ్యి ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేనియెడల పరోక్షంగా Order Pass చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

P.B.NARASIMHA MURTHY
Advocate, Eluru, Cell: 9848143125

పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి - మండవల్లి

ఇచ్చిన మాటకు కట్టుబడి క్రమం తప్పకుండా పెన్షన్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి దక్కిందని మండవల్లి సర్పంచి మెండ ఝాన్సీ స్పష్టం చేశారు. గృహ సారథులతో, వాలంటీర్లతో కలిసి ఆమె బుధవారం పెన్షన్ దారులకు పెన్షన్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ తాత అవ్వలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతంలో పెన్షన్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూడాల్సి వచ్చేదని, నేడు జగన్మోహన్‌రెడ్డి ఒకటో తేదీన క్రమం తప్పకుండా ఇంటికి తీసుకువచ్చి అందిస్తున్నారన్నారు. పెన్షన్‌ను మరింత రెట్టింపు చేసేలా తాత అవల ఆశీస్సులు జగనన్నకు మెండుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ కొల్లా కృష్ణ, మెండా సురేష్, వాలంటీర్లు పాల్గొన్నారు.

మహారాజశ్రీ పాలకొల్లు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 155 of 2021

Between:

గూడూరి చిన పుల్లయ్య -వాది

అండ్

శ్రీమతి కొండేటి కృష్ణవేణి @ కట్టా కృష్ణవేణి -ప్రతివాది

శ్రీమతి కొండేటి కృష్ణవేణి @ కట్టా కృష్ణవేణి, W/o. పార్థసారథి, D/o. కట్టా వెంకట త్రిమూర్తులు, నాయుడుతోట, విశాఖపట్నం.

వాది దాఖలు చేసిన ప్రకటన

పై నెంబర్ గ్రంథంలో మీరు ప్రతివాది అయివున్నారు. మీకు ఎన్నిసార్లు సమనులు కట్టినప్పటికీ మీరు కావాలని అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసు అమలు నిమిత్తం పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు వేసినారు. కావున మీరు **16-03-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ముందు మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గానీ హాజరు అయి మీకు ఏమైన ఆక్షేపణలు వున్న తెలియచేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున పై కోర్టు వారు తీర్మానం చేయుదురని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

కొప్పర్తి వెంకట సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, పాలకొల్లు
సెల్: 9866068748
ఐనంపూడి కామేశ్వరరావు
ఐనంపూడి శ్రీదేవి కృష్ణవేణి
ది.01-03-2023 అడ్వకేట్, తణుకు

మహారాజశ్రీ 8వ అదనపు జిల్లా జడ్జి ఏలూరు వారి కోర్టులో

ఎం.వి.ఓ.పి.నెం. 697/2019

బిట్వీన్:

మహాదాస్యమ్ శ్రీనివాసరావు మరియు వగైరాలు **...పిటీషనర్లు**

మరియు

వేముగంటి సుధా పరిమళ మరియు వగైరాలు **...రెస్పాండెంట్లు**

పై నెంబరు ఓ.పి.ను పిటీసనర్లు శ్రీమతి మహాదాస్యమ్ శ్యామలాదేవి గారు ది.12-10-2017వ తేదీన యాక్సిడెంటులో చనిపోతే నష్టపరిహారము రెస్పాండెంట్లు ఇప్పించమని పై కోర్టులో O.P దాఖలు చేసియున్నారు. దానిపై రెస్పాండెంట్లు అయిన 1) వేముగంటి సుధాపరిమళ, భర్త: నరసింహమ్, AP 31 BF 4799 కారు డ్రైవరు, ప్లాట్ నెం.203, రోడ్ నెం.7, రాయల్ హైట్స్, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా, ఎ.పి. 2) ఎన్.డి.వి.ఎన్.సింధూర, తండ్రి: నాగేశ్వరరావు, AP 31 BF 4799 కారు ఓనర్, ఆంధ్రా బ్యాంకు ఎదురుగా, ధవళేశ్వరం, తూర్పు గోదావరి జిల్లా, ఎ.పి. 3) ఎం.హనుమంతరావు, తండ్రి: శ్రీనివాసరావు, AP 31 BF 4799 కారు ఓనర్, ఎఫ్.సి.ఐ. కాలనీ, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా, ఎ.పి. అను వారు ఏవిధమైన అభ్యంతరములు ఉన్న ఎడల **ది. 20-03-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

శ్రీ అంబుల వెంకట నారాయణ
ఏలూరు, న్యాయవాది, ఏలూరు.
27-02-23. సెల్: 98484 22155

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE :: ELURU

E.P.NO. 89/2018

O.S.NO. 376/2015

Between:

Cheekati Vara Prasad

...Decree Holder

VS

Kalneedi Venkateswara Rao

...Judgement Debtor

AUCTION PUBLICATION

WHEREAS the DHR obtained money decree against the JDR above named and brought the below mentioned schedule property to sale in the above Execution proceedings.

WHEREAS the Honorable Principal Senior Civil Judge, Eluru fixed the date **i.e. 20-03-2023** for the sale of the schedule property by public auction in the Court, by ordering publication of the sale for notice to the intending bidders in order to participate in the auction.

TAKE NOTICE that the persons who intends to participate in the auction for purchase of the schedule mentioned property can appear before the **Honorable Court on 20-3-2023 at 10.30 A.M.** onwards and participate in the auction.

SCHEDULE

All the part and parcel of the Landed property situated in Yepugunta Village of T.Narasapuram Mandal, Chintalapudi Sub-Registry, in R.S.No.166 in an extent of Ac.2-57 cents out of Ac.7-29 cents bounded by:

East: Landed property Kalneedi Subba Rao.

South: Landed property belongs to Lavankuala Gangadhara Rao.

West: Road.

North: Landed property belongs Kurasam Venkateswara Rao.

Within the above boundaries an extent of Ac.2-57 cents out of Ac.7-29 cents with all easementry rights.

DHR Value: Rs. 5,00,000/-
Amin Value: Rs. 30,06,000/-
J.D.R. Value Not Stated

DEVULAPALLI SREE RAM
D.KRISHNA SASTRY
Eluru, 27-02-23. Advocates for DHR